క్లుప్తంగా

పొరపాట్లకు తావివ్వొద్దు



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా చేస్తున్న సర్వేల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని మల్లారివీధి, ముగతిపేటలోని 1, 2వ వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ అంజనేయులుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో రికార్డులు పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11రకాల సర్టిఫికెట్లు అందించేందుకు వారి వద్ద నుంచి సరైన డేటాను ఇంటింటికీ వెళ్లి సేకరించి ప్రజలకు సత్వర సేవలందేలా చర్యలు తీసుకోవాలని వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నిర్దేశించిన తేదీలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ ఆర్ఐలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కాశిరెడ్డినాయన ఆలయ వార్షికోత్సవం

తుగ్గలి: మండల పరిధిలోని రాంపల్లిలో వెలసిన సద్గురు కాశిరెడ్డినాయన ఆలయ 18వ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఉత్సవాల సందర్భంగా 30న వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు,రూ.10 వేలు,రూ.5 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు ప్రకటించారు. వివరాలకు 94400 97301, 94914 13542 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఆస్పరి: తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే వారికి బంగారు భవిష్యత్ ఇచ్చిన వారవుతారని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం నగరూరు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లి దండ్రుల సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన మా ర్పులు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసు కుని పిల్లలను బాగా చదివించాలని సూచించారు.

నేడు జొహరాపురానికి మంత్రి రాక

ఆస్పరి: మండలంలోని జొహరాపురంలో బుధవారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హాజరు కానున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య మంగళవా రం తెలిపారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. అధికారులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

కోలుకోలేక మహిళ మృతి

ఆస్పరి: బిల్లేకల్లు గ్రామానికి చెందిన చెట్టిమ్మ (23) చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. వివరాలు.. చిట్టెమ్మకు మూడేళ్ల క్రితం మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన మహానందితో వివాహం జరిగింది.వీరికి ఒక కుమారుడు ఉన్నారు. చిట్టెమ్మను భర్త దూరంగా ఉంచడంతో బిల్లేకల్లులో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. భర్త దూరంగా ఉంచడం, అనారోగ్యంతో మనస్తాపం చెంది ఈనెల 22న ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

వైద్యాధికారిగా ప్రవీణ్

కృష్ణగిరి: కృష్ణగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిగా ప్రవీణ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న మహేశ్వరప్రసాద్ నందవరం మండలానికి బదిలీ కాగా వైఎస్సార్ జిల్లా నుంచి ప్రవీణ్ ఇక్కడికి వచ్చారు. సిబ్బంది సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

డిజిటల్ లైబ్రరీలు మంజూరు

మద్దికెర: మండలానికి 4 డిజిటల్ లైబ్రరీలు మంజూరైనట్లు తహసీల్దార్ నాగభూషణం మంగళవారం తెలిపారు.ఆయన మాట్లాడుతూ మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, ఎడవలిలో డిజిటల్ లైబ్రరీలు నిర్మించేందుకు మూడు నుంచి నాలుగు సెంట్ల స్థల సేకరణ చేయాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. సంబంధిత వీఆర్వోలతో గ్రామాలకు వెళ్లి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చెన్నంపల్లె వెంకటేశ్వరరెడ్డికి సాయం అందజేస్తున్న రామచంద్రారెడ్డి దంపతులు

పత్తికొండటౌన్: తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి ఇటీవల కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నారు. మంగళవారం కేడీసీసీ మాజీ వైస్‌చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, పత్తికొండ మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ దంపతులు చెన్నంపల్లి వెంకటేశ్వరరెడ్డిని పరామర్శించారు. వైద్య ఖర్చులకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. అలాగే కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అందించిన మరో రూ.లక్షను బాధితుడికి అందజేశారు.

అమ్మ ఒడి.. మెరుగ్గా బడి

- నేడు విదార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ కానున్న నగదు
- చిన్నారుల చదువుకు ప్రభుత్వం భరోసా
- నియోజకవర్గంలో 310 పాఠశాలలు, 34,903 మంది విద్యార్థులు



హులేబీడు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మఒడి పథకం లక్షలాది నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా నిలుస్తోంది.పేద పిల్లల చదువులకు భరోసా కల్పిస్తోంది. పిల్లల చదువులపై ఆందోళనతో ఉన్న మాతృమూర్తులకు సీఎం ప్రవేశపెట్టిన ఈ పథకం ఎంతో ఊరటనిస్తోంది. దీంతో నిరుపేదలు, మధ్యతరగతి కి చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.ఇచ్చిన మాట ప్రకారం గత మూడేళ్లుగా అమ్మ ఒడి పథకాన్ని పకడ్బందీగా అమలు చేయగా ఈ వి ద్యా సంవత్సరం నాలుగో విడత అమలు దిశగా చ ర్యలు తీసకుంది. ఈ పథకాన్ని బుధవారం ముఖ్య మంత్రి వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్నారు.

ఆన్‌లైన్‌లో వివరాలు

పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేసి పథకానికి సంబంధించిన వైబ్‌సైట్‌లో ఉంచారు. విద్యార్థుల పేర్లు, తల్లులు, సంరక్షకుల బ్యాంకు ఖాతా నంబర్, బ్యాంక్ ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఆధార్, రేషన్ కార్డు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏవైనా లోపాలు ఉంటే పాఠశాల హెచ్ఎంలను సంప్రదించి సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో బుధవారం నగదు జమ కానుంది.

హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లులు

పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్న కారణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మ ఒడి పథకానికి నాంది పలికారు. ఏటా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రూ.15 వేల నగదు వారి తల్లులు, సంరక్షురాల ఖాతాల్లోకి జమ చేయాలని ప్రజాసంకల్ప పాదయాత్రలో నిర్ణయించారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పథకాన్ని అమలు పరిచారు. ఈ ఏడాది అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టి బుధవారం ఖాతాల్లోకి నగదు జమ చేయనుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై తమ బిడ్డలను చదివించడానికి ఇబ్బందులు ఉండవని తల్లులు చెపుతున్నారు.

నియోజకవర్గంలో అర్హులైన విద్యార్థుల వివరాలు

మండలం	విద్యార్థులు	ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు
ఆలూరు	5,590	53
ఆస్పరి	7,293	63
హొళగుంద	6,523	52
హాలహర్వి	4,299	39
చిప్పగిరి	2,696	31
దేవనకొండ	8,502	74

జగనన్న రుణం తీర్చుకోలేనిది



జగనన్న అమ్మ ఒడి పథకం మా పిల్లలకు వరంగా మారింది. ఏటా రూ.15 వేల నగదు నా ఖాతాలోకి జమ అవుతుండడంతో పిల్లల చదువుల ఖర్చులకు ఢోకా లేకుండా పోయింది. వచ్చిన నగదుతో మా పిల్లల చదువు చక్కగా సాగుతోంది. జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– జరీనా బీ, హత్తిబెళగల్ గ్రామం

నా బిడ్డ చదువుకు ఆటంకం ఉండదు



మాది పేద కుంటుంబం. నా భర్త నేను రోజు కూలీకి వెళితే గాని కుంటుంబం గడవదు. అలాంటిది పిల్లల పుస్తకాలు, బట్టలు చదువు కోసం అయ్యే ఖర్చు భరించలేక పోయేదాన్ని. ఆడ పిల్లను చదివించడం భారంగా మారింది. ముఖ్యమంత్రి జగనన్న అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేలు అందిస్తుండడంతో నా బిడ్డ చదువుకు ఆటంకం తొలగిపోయింది.

– జోగి నాగలక్ష్మి, ఆలూరు గ్రామం

3,420 మందికి 'అమ్మ ఒడి'

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యనభ్యసిస్తున్న 3,420 మంది విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద రూ.4,44,60,000 మంజూరైనట్లు ఎంఈఓ రంగస్వామి మంగళవారం తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.13వేల చొప్పున బుధవారం వారి తల్లుల ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదు జమ చేస్తారన్నారు.

సమాచారం ఇచ్చేది వీరే ..

సాక్షి ఎఫెక్ట్



సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు చేర్చిన దృశ్యం

చిప్పగిరి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు లేకపోవడం ప్రజలు ఇబ్బందులు పడేవారు. దీనిపై ఈ నెల 26న 'సమాచారం చెప్పేదెవ రో' శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు సహాయ ప్రజా సమాచార అధికారి శ్రీరాములు, ప్రజా సమాచార అధికారి యం.శ్రీనివాసులు, అప్పిలేట్ అధికారి సివి కొండయ్య పేర్లను సమాచార హక్కు చట్టం బోర్డులో నమోదు చేశారు. దీంతో మండల ప్రజలు వివిధ పథకాలు, ప్రభుత్వ సేవల సమాచారం పొందేందుకు సులభతరమైంది.

ముస్లింలకు అండగా ప్రభుత్వం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ముస్లిం మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా తదితరులు

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పరిపాలనలోనే ముస్లింలకు అన్ని విధాలుగా అండగా నిలిచారని ముస్లిం మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు నియాజ్‌అహమ్మద్, ముస్లిం మైనారిటీ నాయకులతో కలిసి 'హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాథ్' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లింలకు నవరత్నాలతోపాటు అనేక సంక్షేమ పథకాల ద్వారా రూ.22 వేల కోట్ల రూపాయల ఆర్థిక లబ్ధి చేకూర్చారన్నారు. రాజకీయంగా పదవులు కల్పించి సముచిత న్యాయం చేశారన్నారు. షాదీ తోఫా పథకం కింద రూ.లక్ష అందిస్తున్నారని, హజ్‌యాత్ర కోసం ముస్లింలపై పడ్డ అదనపు ఆర్థిక భారం రూ.14.41 కోట్లు ప్రభుత్వమే భరించిందన్నారు. అన్ని విధాలా ఉండగా ఉన్న సీఎంగా వైఎస్ జగన్‌కు మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కో–ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, జామియా మసీద్ అధ్యక్షుడు ఖాశింబేగ్, ముస్లిం మత పెద్దలు యుసుఫ్‌మౌలానా, అతావుల్లా మౌలానా, హాజీ వాహిద్, వహబ్, మన్సూర్, అల్లాబకాష్, కౌన్సిలర్లు వాహిద్, అమాన్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం కల సాకారం



పత్తికొండలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ప్రభుత్వ పరిపాలనను ప్రతి గడపకు తీసుకొచ్చి గ్రామ స్వరాజ్యం కలను సాకారం చేసిన ప్రజా నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం పత్తికొండ 15, 16 వార్డులలోని కల్లుపెంట వీధి, టీచర్స్ హోం, ఉప్పర వీధిలో పార్టీ నాయకులు, అధికారులతో కలసి విస్తృతంగా పర్యటించారు. దాదాపు 350 కుటుంబాల ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించి కరపత్రాలను అందజేశారు. పలు చోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు లేవనెత్తిన సమస్యలను ప్రాధాన్యతాపరంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ నారాయణదాసు, నాయకులు ఎస్.నాగరత్నమ్మ, కొమ్ముదీపిక, శ్రీరంగడు, కారం నాగరాజు, సోమశేఖర్, భాస్కర్‌నాయక్, నీలకంఠ, ఎంపీడీఓ లలిత, ఎస్‌ఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: బొందిమడుగుల సమీపంలో వెలసిన సుంకులమ్మ దేవర ఉత్సవాలకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విత్తన డీలర్లకు లైసెన్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఏఓ వరలక్ష్మి

ఆలూరు రూరల్: లైసెన్స్ కలిగిన డీలర్లు మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 5 మండలాల అగ్రి ఇన్‌పుట్స్ డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలు, ఎరువులు పురుగు మందులను రైతులకు అందించాలని, విక్రయించే సమయంలో రైతు సంతకం తీసుకుని బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ నమోదు చేయాలని, షాపు వద్ద స్టాక్ బోర్డు ఉంచాలని ఆదేశించారు. ప్రతి నెలా స్టాక్ వివరాలు, బిల్లు బుక్‌లను ఏఓల వద్ద అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తే షాపులు సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్ ఏడీఏ వెంకటేశ్వర్లు ఆలూరు ఏడీఏ సునీత, ఏఓలు వెంకటేశ్వర గౌడ్, నరేంద్ర కుమార్, జయలక్ష్మి, శివశంకర్, ఆనంద్ పాల్గొన్నారు.

డీఎస్పీ పేరుతో మోసం

కృష్ణగిరి: డీఎస్పీ పేరుతో వ్యక్తిని మోసగించిన సంఘటన చిట్యాల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చిట్యాలకు చెందిన గొల్ల మల్లేష్ ఈ నెల 22న పొలంలో పని చేసుకుంటుండగా గ్రామ సేవకుడు ఫోన్ చేసి డీఎస్పీ నుంచి ఫోన్ వచ్చిందని తెలిపాడు. మల్లేష్ ఇంటికి వచ్చి ఫోన్‌లో మాట్లాడగా మీ తల్లిదండ్రులకు జరిగిన యాక్సిడెంట్‌కు సంబధించి రూ.10 లక్షలు బ్యాంకు ఖాతాలో జమఅవుతాయని, ఇందుకోసం ఎస్‌బీఐ ఖాతా నంబర్ 36321029951కు రూ.16,471 ప్రకారం రెండుసార్లు పంపాలని చెప్పారు. నమ్మిన మల్లేష్ చిట్యాలలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి రెండు విడతలుగా రూ.32,942 పంపాడు. తర్వాత బ్యాంకు ఖాతాలో నగదు జమకాకపోవడం, సదరు నంబర్‌ను విచారించగా డీఎస్పీ కాదని, మోసపోయినట్లు గుర్తించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనం ఢీకొని జింకకు గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని చెన్నాపు రం గ్రామ మలుపు వద్ద మంగళవారం రోడ్డు దాటుతున్న జింకను ఆదోని వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యా యి. జింకను ఢీకొట్టిన వాహనం ఆగకుండా వెళ్లిపోవడంతో అటుగా వెళ్తున్న వారు జింకను రోడ్డు పక్కకు తీసుకొచ్చి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. జింక కాలుకు గాయం కావడంతో ప్రథమ చికిత్స చేయించి రిజర్వు ఫారెస్ట్‌లో వదిలినట్లు ఫారెస్ట్ అధికారిణి అనురాధ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ కొండ మలుపు వద్ద మంగళవారం కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న దాసరి రాముడు గాయాలపాలయ్యాడు. సి.బెళగల్‌కు చెందిన దాసరి రాముడు ఆదోనిలో చేపలు విక్రయించి తిరిగి బైక్‌పై వస్తుండగా కోటేకల్ మలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. దాసరి రాముడు కిందపడి గాయాలపాలుకాగా అక్కడున్న వారు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

కాలువ మట్టి తరలిస్తే చర్యలు

మద్దికెర: హంద్రీనీవా కాలువ మట్టిని అనుమతి లేకుండా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్ఎన్ఎస్ఎస్ డీఈ శ్రీనివాస్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం మద్దికెర సమీపంలో బొజ్జనాయుని పేట బ్రిడ్జి వద్ద కాలువ వెంబడి మట్టిని తరలిస్తున్న విషయం తెలుసుకొని దాడులు నిర్వహించారు. మట్టి తరలిస్తున్న వారు పారిపోవడంతో ప్రొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా కాలువ తెగిపోతే అవసరాల కోసం మట్టిని అందుబాటులో ఉంచామని అయితే కొంతమంది మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇక నుంచి ఇలాంటి సంఘటనలు జరిగితే కేసులు నమోదు చేస్తామన్నారు. మట్టి తరలింపు దారులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పల్లెల ప్రగతి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి జయరాం



వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా మంజూరైన ట్రాక్టర్‌పై మంత్రి జయరాం

ఆలూరు/దేవనకొండ: ప్రజాప్రతినిధులు సేవకులుగా భావించి పనిచేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. దేవనకొండ మండలం నెల్లిబండ, బండగట్టు గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గ్రామంలో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు గడిచిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వ కృషి చేస్తోందని, వైఎస్సార్‌సీపీ హయాంలో పల్లెలు ప్రగతి బాటలో పయనిస్తున్నాయన్నారు. నెల్లిబండ, బండగట్టు గ్రామాల్లో అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. రెండు గ్రామాల్లో ఇప్పటివరకు వివిధ పథకాల ద్వారా ప్రజలకు రూ.2.30 కోట్లు అందించినట్లు తెలిపారు. నెల్లిబండ గ్రామంలో కొలువుదీరిన పెద్దమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిదేవి, జెడ్పీటీసీ రామకృష్ణ, మల్లికార్జున, లలితమ్మ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద మంజూరైన సబ్సిడీ ట్రాక్టర్, యంత్ర పరికరాలను రైతులకు అందించారు. ట్రాక్టర్ నడిపి రైతుల్లో ఉత్సాహం నింపారు.

నేడు విద్యుత్ కోతలు

కృష్ణగిరి: కృష్ణగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి మంగళవారం తెలిపారు. 22 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 4గంటలపాటు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి సంబంధించి 3 ఫేజ్ సరఫరాను ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 5 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం1నుంచి 6గంటల వరకు ఇస్తారని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

దేవనకొండ: మండలంలో వివిధ గ్రామాలకు తరలిస్తున్న 194 ప్యాకెట్లను కర్ణాటక మద్యాన్ని మంగళవారం పోలీసులు కప్పట్రాళ్ల గ్రామ సమీపంలో గొల్లవానికుంట వద్ద స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన బోయ ఈరన్న, బోయరామాంజిని (దేవనకొండ) పట్టుబడగా మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

సంక్షేమ పాలన కనిపించడం లేదా?

చిప్పగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన అభివృద్ధి కార్యక్రమాలు దేవనకొండ మండల ప్రతిపక్ష నాయకులకు కనిపించడం లేదా? అని ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ ప్రశ్నించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేవనకొండ మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పర్యటిస్తున్న సందర్భంగా కొందరు పనిగట్టుకొని విమర్శలు చేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు వారికి కనబడవా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాలనపై నేరుగా ప్రజల వద్దకు వెళ్లి అడిగిన పార్టీలు గతంలో లేవన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఏరూరు రంగస్వామి తదితరులు ఉన్నారు.

రీసర్వేతో భూ రికార్డుల ప్రక్షాళన

కృష్ణగిరి: భూ రికార్డుల ప్రక్షాళన పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు.స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే చేపట్టిందని వివరించారు. మండలంలోని 15 రెవెన్యూగ్రామాల్లో సర్వే చేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయికి వచ్చే అధికారులకు రైతులు సహకరిస్తే సర్వే వేగవంతంగా పూర్తవుతుందన్నారు.

న్యాయమైన పరిహారం చెల్లించాలి

మద్దికెర: తమ భూములకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు ఆర్డీఓ మోహన్‌దాస్‌కు విన్నవించారు. మంగళవారం హంప గ్రామంలో రైల్వే డబ్లింగ్‌కు భూములిచ్చిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. డీటీ నాగరాజు ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది సౌకర్యాలు కల్పించడమే గాక విద్యార్థులకు అమ్మ ఒడి పథకం అందిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ రంగస్వామి అన్నారు. మంగళవారం స్థానిక పేటా స్కూలులో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను వివరించి పిల్లలను చేర్పించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కృష్ణగిరి: జగనన్న లేఅవుట్లతోపాటు గ్రామాల్లో వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విశ్వమోహన్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులను చైతన్య పరుస్తూ నిర్మాణాలు చేపట్టేలా చూడాలని, అలాగే బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. హౌసింగ్ ఏఈ షేక్షావలి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మద్దికెర: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని వైకేపీ ఏపీఎం మధుబాబు అన్నారు. మంగళవారం సోషల్ మొబిలైజేషన్‌లో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న వంద మంది మహిళలు పెరటి తోటలో నాటుకునేందుకు ఏడు రకాలు ఆకుకూరలు, కాయగూరల విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. వీఓఏలు ఉదయ్‌కుమార్, శ్రీనివాసులు, రఫీ, జ్యోతి, రాజు సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారిణి శ్రీవాణి

ఎమ్మిగనూరురూరల్: మహిళలు స్వశక్తి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని హార్టికల్చర్ అధికారి శ్రీవాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు సూక్ష్మ వ్యాపారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేలా చిన్నచిన్న పరిశ్రమలు పెట్టించి చేయూత ఇస్తోందని చెప్పారు. మహిళలు సొంతంగా లేదా గ్రూపుగా వ్యాపారాలు ప్రారంభించేందుకు సొసైటీ ద్వారా శిక్షణ ఇస్తునట్టుట్ల తెలిపారు. పరిశ్రమ ఏర్పాటుకు 10 శాతం పెట్టుకుంటే మిగతా 90 శాతం బ్యాంకు రుణం కల్పిస్తారని చెప్పారు. జిల్లా రిసోర్స్ పర్సన్ ప్రశాంత్, వెలుగు సీసీలు రాజన్న, గంగాధరయ్య, ఈశ్వరమ్మ, అరుణ, మాబి తదితరలు పాల్గొన్నారు.

టాపర్లకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

నందవరం: విద్యతోనే విద్యార్థులకు మంచి గుర్తింపు లభిస్తుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సీఐ మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు మంగళవారం సీఐ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులు జె.శేఖర్(నాగలదిన్నె) జెడ్పీ హైస్కూల్, మణికంఠ(నందవరం) జెడ్పీ పాఠశాల, గోవిందు (ముగతి) మోడల్ స్కూలు బహుమతులు అందుకున్నారు.హెచ్ఎంశివరామ్,ఎస్ఐతిమ్మయ్య పాల్గొన్నారు